# 29. రహస్యం

నా జీవితంలోని కొన్ని పాతఘట్టాల్ని విశదీకరించి రాయమని అడిగావు. నేనిప్పుడు ముసలిదాన్నయ్యాను. నాకు పిల్లలు కానీ, బంధువులు కానీ లేకపోవటంవల్ల, నీ వంటి స్నేహితురాలి దగ్గర దాచాల్సిన రహస్యాలేమీ లేవు. కాని నువ్వు ఏ సందర్భంలోనన్నా యీ కథను బైటపెడితే మాత్రం నా పేరు చెప్పవోక.

నాకు చాలామంది ప్రియులుండేవాళ్ళని నీకు తెలుసుగా! ఆనాటి సౌందర్యపు ఛాయలు యీనాడేమీ నాలో కనిపించకపోయినా, అప్పుడు నేను అందగత్తెనే. పీల్చేందుకు గాలి ఎంత ముఖ్యమో, నా జీవితానికి 'ప్రేమ' అంత ముఖ్యం. ఆ ప్రేమే లేకుండా – ఇతరుల మధురభావాలు నన్ను చుట్టుముట్టి వున్నయ్యని తెలియకుండా – జీవించటంకన్న మృత్యువే మేలనిపించేది. స్త్రీలు తమకున్న బలాన్నంతటినీ ఉపయోగించి జీవితంలో ఒక్కసారే ప్రేమించగలమని నమ్ముతారు కాని, నా జీవితంలో నేను చాలాసార్లు, మొదటి సారంతబలంగానూ ప్రేమిస్తూ, యీ మార్పుకిక చలనంలేదని నమ్మేదాన్ని. కాని అది మానవుడంత సహజంగా చచ్చి, పునర్జన్మ ఎత్తినట్టు ఇంకో దిక్కుకు తిరిగేది.... ఈసారి నాజీవితంలో మొదట లోకమంటే, పురుషులంటే ఏమిటో తెలుసుకున్న ఒక ఘట్టాన్ని రాస్తాను. ఇది నా కథే ఐనా, ఇతర్లకు సంబంధించిన బీజాలు చాలా ఉన్నయ్...

అప్పటికి నా వివాహమై సంవత్సరమైంది. నా భర్త భాగ్యవంతుడైనా, నిజం చెప్పాలంటే, నాకు అతనిమీద ప్రేమలేదు. ప్రేమ – స్వచ్ఛమైన ప్రేమ... పెరిగేందుకు స్వేచ్ఛ, కష్టాలూ అతి ముఖ్యమైనవని నా అభిప్రాయం. కాని చట్టం శాసించిన ప్రేమ,

మతం దయదల్చి విసిరిపారేసిన ప్రేమ – అసలు దాన్ని 'ప్రేమ'గా చెప్పగలమా? దొంగిలించి సంపాయించిన ముద్దు మాధుర్యంలోని ఏ భాగమైనా, చట్టం ఇచ్చిన ముద్దుకు వుంటుందా?

నాభర్త పొడుగ్గా, బలిష్ఠంగాఉండి, శ్వాసలోకూడా తన భాగ్యాన్ని సూచించేవాడు. ఇన్నీవున్నా ఆయనకు తెలివితేటలు సున్నా, ఆయన చెప్పే సిద్ధాంతాలు 'తాపట్టిన కుందేటికి మూడేకాళ్ళన్నట్టు' వుండటంవల్ల – ఆయనతోడి సంభాషణ నిస్సారంగా ఉండేది. వంశపారంపర్యా వచ్చే నీతివాక్యాల్తో కూడిన కొన్నిశాసనాలు ఆయనబుర్రలో ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి. ఆయన ఏ విషయంలోనూ ఆగి ఆలోచించేవారుకాదు. ఏ విషయంలోనైనా సరే యితర అభిప్రాయాల్నయినా చూడకుండా, కాచివడబోసిన సత్యం తన కొక్కరికే తెలుసునన్నట్టు – తన అభిప్రాయాన్ని వెనువెంటనే ఇచ్చేవారు. టోకుబేరంలో వేసుకున్న సరుకులాగు, ఆయన బుర్రంతా ఇలాటి ఆలోచనలతోనేనిండి, పెద్దగాలి – ఇంటి తలుపు ల్లోంచీ కిటికీల్లోంచీ తోసుకొచ్చినట్టు – మహావేగంతో బైటపడేవి.

మా ఇల్లు పెద్దపొలానికి మధ్యగా ఉండేది. ఆ చీకటికొంప చుట్టూ పెరిగిన చెట్లకు పట్టిన నాచు ముసలివానిగడ్డాన్ని జ్ఞాపకం చేసేది. ఇంటిని చుట్టిన పెద్దపొదలు భయంకరంగా ఉండేవి. ఆవరణలో చెత్తాచెదారమూ  పెరిగిన రెండు పెద్దసరస్సు లుండేవి. ఈ రెండు సరస్సుల్నీ కలిపే సెలయేటిగట్టున – ఆయన – బాతులవేటకోసం ఒక చిన్న గుడిసెను ఎన్నడో నిర్మించుకున్నారు.

మామూలు ఇంటిమనుషులు కాక – జంతువును జ్ఞాపకంచేసే ఒక వంటమనిషి నా భర్తను, భర్తగాకూడా ఉపయోగించుకుంటూండేది. నేను ఐదేళ్ళక్రితం స్పెయిన్‌నుంచి వెంటతెచ్చుకున్న దాసీపిల్ల ప్రత్యేకం – నాకు దాసీగానేకాక, దాదాపు స్నేహితురాలిగా ఉండేది. ఆమె గోధుమరంగు శరీరచ్ఛాయనూ, నల్లనికళ్ళనూ, ఫాలభాగం మీదికి చింతకాయల్లాగు వేళ్లాడేజుట్టును మొదటిసారి చూసినవాళ్ళు ఆమెను చౌకరకం వేశ్యగా తీసుకుంటారు. అప్పటి ఆమె వయస్సు పదహారేళ్ళే ఐనా, ఇరవై ఏళ్ళ దానిలాగు కనిపించేది.

వేటగాళ్ళకు సంతోషాన్నిచ్చే వసంత ఋతువు ప్రవేశించింది. మేము మా భూముల్లోనూ, ఒక్కొక్కప్పుడు మా ఇరుగు పొరుగుల భూముల్లోనూ కూడా వేటాడుతూండేవాళ్ళం. మా ఇంటిపొరుగునవున్న భాగ్యవంతుడైన యువకుడు – మా ఇంటికి ఒంటరి రాకపోకలు సాగించి, నా అభిమానాన్ని సంపాయించాడు. కాని అతని రాకలు హఠాత్తుగా ఆగిపోవటంవల్ల, అతన్ని గూర్చి విచారించటం మానేశాను. ఏమైనా నాపట్ల, నా భర్త ధోరణి మారిందని గ్రహించగలిగాను. ఆయన తన కేదో పెద్దపనివున్నట్టు, ముఖంలో విసుగుదలను సూచించుకుంటూ తిరిగేవారు. ఆయన

నాగదిలోకి రాకపోతూన్నా, ఒకరాత్రివేళ ఏదో కాలిచప్పుడువచ్చి నా గది తలుపు దగ్గర ఆగి, కొన్ని నిముషాలయ్యాక తిరిగి ఎటో వెళ్ళిపొయ్యేది. ఇది నేను చాలా రాత్రులనుంచీ గమనిస్తూనే వున్నాను. నా గదికిటికీ కిందిగా ఉండటంవల్ల - ఎవరో ఆ చీకట్లో ఇంటిచుట్టూ తిరుగుతున్నారని కూడా తోచేది. ఈ విషయం ఆయనతోచెప్తే, ఒక నిమిషం నా వైపు నిశ్చలంగాచూసి, "ఏం లేదు ఇంటికాపలావాడు గస్తీ తిరుగుతూంటాడు" అని జవాబు చెప్పారు.

## 2

ఒక సాయంత్రం ఆయన, "ఒక నక్క రోజూ రాత్రివేళ మన కోళ్ళను ఎత్తుకు పోతోంది. దాన్నివ్వాళ కాల్చాలి. రాత్రి, రెండు మూడు గంటలు తోడుగా ఉండగలవా?" అని అడిగారు.

ఆయన ముఖంలోని వ్యాకులతా, కంఠంలో ఆ స్వాభావికతా స్పష్టంగా కనిపిస్తున్నాయ్. ఆయన ప్రశ్నకు నేనొక్కసారిగా జవాబివ్వలేకపొయ్యాను... ఆయన నా ముఖంలోకి పట్టుదలను సూచించే చూపును చూసినా, నేను దాన్ని అర్థం చేసుకోలేక, "తప్పకుండా సహాయం చేస్తాను-" అన్నాను.

తోడేళ్ళనూ, అడవిపందుల్నీ - పురుషుల్లాగే వేటాడే ధైర్యమూ, చాకచక్యమూ నాకువుంది. అందుకనే ఆయన నా సహాయాన్ని అడిగినప్పుడు, నాకు అనుమానమేమీ కలగలేదు. కాని ఆయన నా జవాబుతో ఏదో మార్పు జెంది, ఆ సాయింత్రమంతా ఏదో బాధకు గురి అవుతూనే ఉన్నారు.

రాత్రి పదిగంటలకు ఉన్నట్టుండి, "నువ్వు సిద్ధంగా ఉన్నావా?" అని అడిగారు. నేను వెంటనే బయలుదేరేందుకు లేచినిలబడి, "తుపాకిలో ఏం వేసుకోను? రవ్వా? గుండా?" అని అడిగాను.

ఆయన ఆశ్చర్యపడ్డట్టు కనిపించారు. "గుండె!" అని కంఠాన్ని తమాషాగా మార్చి, "నీకు భయంలేదూ?" అన్నారు.

"భయమా?" అని నవ్వి, "దేనికీ? వెధవ నక్కను కాల్చేందుకుకూడా భయమా? ...మీరు మనస్సు ఎక్కడవుంచి మాట్లాడుతున్నారు?" అన్నాను. ఆయన నవ్వి, ఊరుకున్నారు....

ఇల్లంతా నిద్రపోతోంది. ఇంటిని ఆనుకొనివున్న పెద్ద తోటలోంచి మేము నడవసాగాము. ఈ పురాతన కట్టడాన్ని చంద్రుడు తన తెల్లని కిరణాలతో ముంచివేస్తున్నాడు. చెట్లకిందమాత్రం వెలుగు - నీడల సఖ్యత చూడనవుతోంది. ఏశబ్దమూ యీరాత్రి నిశ్శబ్దతను భేదించటంలేదు. గాలి కూడా సరిగ్గా ఆడటంలేదు.

రాత్రి సంచారంచేసే ఏపిట్టాకూడా అరవటంలేదు. భూమిమీద పెద్దబరువేదో పడి ఏ శబ్దమూరాకుండా చెయ్యగలుగుతోందేమో ననిపించింది.

చెట్లకిందమాత్రం రాలిన ఆకులవాసన నాలో కొత్తరకం చలిని ప్రవేశపెట్టినయ్; ఆయనమాత్రం ఏమీ మాట్లాడకుండా, తన దేహమూ, ఆత్మాకూడా యీ క్షణాన వేట నిమిత్తమే అర్పించబడుతూన్నట్టు ముందుకు చూస్తున్నారు.

త్వరలోనే సరస్సు గట్టుకుజేరాం. సరస్సులు పొడుగ్గా పెరిగిన గడ్డిమొక్కలుకూడా కదలటంలేదు. కాని అప్పుడప్పుడు - ఏదో కనపడని వస్తువు నీటిమట్టాన్నితాకి, అలలను అన్నిదిశల నుంచీ సరస్సు గట్టులకు జేరుస్తోంది.

ఆయన పూర్వం నిర్మించుకున్న గుడిసెజేరాక ఆగారు. ఇదే మేము కాపలా కూర్చోవాల్సిన ప్రదేశం, ముందుగా నేనే ప్రవేశించాను. ఆయన ధైర్యంగా తుపాకిని సిద్ధం చేసుకున్నారు. ఆ చిన్న శబ్దం. నన్ను ఎందుకోగాని భయపెట్టింది.

"నీకు యీ పరీక్ష చాలనుకుంటాను; అలాగైతే నువ్వు వెళ్ళొచ్చు" అన్నారాయన.

నేను ఆశ్చర్యపడి అన్నాను; "ఎప్పటికీకాదు...ఇంటికి తిరిగివెళ్ళేందుకు నేనిక్కడికి రాలేదు...ఇవాళ మీరింత వింతగా ఉన్నారేం?"

"సరే...నీఇష్టం-" అని ఆయన గొణిగారు.

కదలిక యేమీ లేకుండా కూర్చున్నాం. అరగంట గడిచినా ఏ శబ్దమూ రాకపోవటంవల్ల, "అది యీదారినే వస్తుందని మీకు బాగా తెలుసా?" అన్నాను.

నేనేమో తనను కొట్టొచ్చినంతగా ఆయన ఉలిక్కిపడి, నా చెవులో రహస్యం చెప్తూన్నట్టు, "నాకు బాగా తెలుసు" అన్నారు.

మళ్ళీ నిశ్శబ్దతే గతయింది ..... ఆయన నా చేతిని గట్టిగా పట్టుకు గుంజేసమయానికి బాగా కునికిపాట్లు పడుతున్నాను.

"నీకు కనిపిస్తోందా?....అదుగో...అక్కడ....ఆ చెట్ల చాటున..." అన్నారు.

నేను కళ్ళను పూర్తిగా తెరిచి, దృష్టి చెదరకుండా చూశాను. కాని నాకేమీ కనిపించనేలేదు. ఆయన ఒక కంటిలో నన్ను చూస్తూ తుపాకి భుజానికి ఆనించారు. నేను కూడా తుపాకీ ఎత్తాను...మాకో ముప్పై గజాల దూరంలో ఉన్నట్టుండి, ఒక పురుషుడు వెన్నెట్లోకి ఉరికాడు. అతను శరీరాన్ని బాగా ముందుకు వంచి, పరుగెత్తుతూన్నట్టు త్వరత్వరగా వెళ్తున్నాడు.

నన్నేదో భయం ఆవరించి, పెద్ద కేక వేశాను. కాని నేను మళ్ళీ అటు తిరిగేప్పటికి, నా కంటిముందునుంచి మెరుపొకటి అతి వేగంగా వెళ్ళింది. మరోక్షణంలో పెద్ద శబ్దం కూడా వినవైంది. అప్పుడే ఆ వ్యక్తి గిరగిరా తిరిగి నేలమీదపడ్డాడు.

అతి భయంతో నేను కేక వేశాను. అకస్మాత్తుగా, ఆయన రెండు చేతులతోనూ నా గొంతుపట్టుకొని, నన్ను నేల మీదికి విసిరివేసి, మళ్ళీ తన బలమైన చేతుల్లోకి తీసుకొని నేలమీద జరజరా లాక్కువెళ్ళి - ఆ గడ్డిమీద బారుగాపడిన వ్యక్తిమీద విసిరికొట్టారు. ఆయన కళ్ళు చూస్తే నాబుర్ర బద్దలు కొట్టేటంత కోపంతో ఉన్నయ్. నాకీ భూమి మీది ఆయువు పూర్తయిందనుకున్నాను. బలమైన తన బూడ్సుల్తో నా ముఖాన్ని చదును చేసేందుకు ఆయన కాలు ఎత్తారు...ఆయన్ను బలమైన ఇంకో రెండుచేతులు గట్టిగా పట్టుకొని నేలకు విసిరికొట్టేదాకా - ఏం జరుగుతోందీ నాకు తెలియలేదు.

నేను ఎగిరి గంతేశాను. ఆయన మీద మోకరించి, అమిత కోపం వచ్చిన పిల్లి లాగుచూస్తూ, అన్నింటికీ తెగించినట్టు - ఆయన్ను గోళ్ళతోనూ, పళ్ళతోనూ ముఖాన్ని గీరి పారేసింది....

....కొంతసేపయ్యాక, ఏదో కొత్త అభిప్రాయం. తనను అప్పుడే ఆవరించినట్టు, ఆమె చప్పునలేచి...చచ్చిన వ్యక్తిమీదపడి, అతన్ని రెండు చేతుల్తోనూ తీసుకొని, అతని జీవమంతా ఇంకా ఆమె దగ్గరే బంధింపబడి ఉన్నట్టుగా - అతని పెదవుల్ని ముద్దాడసాగింది.

ఆయన ఎలాగో లేచి నిలబడి అంతా చూశారు. ఆయనకు నిజ మేమిటో తెలిసిపోయింది. నా ముందు మోకరించి, "నన్ను క్షమించు..నిన్ను అనుమానించి, దాసీదాని ప్రియుణ్ని చంపాను. ఇంటికాపలావాడు నన్ను తప్పుదోవను నడిపించాడు-" అన్నారు.

కాని, నాపాటికి నేను - చచ్చినవాడికీ, బతికున్నదానికీ, సాగే ముద్దుల్ని చూస్తున్నాను...తరువాత ఆమె, తన ప్రేమ తను వెలిబుచ్చుకునేందుకల్లే పెద్దగా ఏడ్వసాగింది.

-ఆ క్షణానే - నా భర్తను మోసపుచ్చకుండా ఉండగలగటం, నా స్వాధీనం తప్పిందని గ్రహించాను.